క్లుప్తంగా

శిరీష కుసుమకు మంత్రి జోగి రమేష్ నివాళి



పెడన: ప్రముఖ కలంకారీ వ్యాపారవేత్త యక్కల సుకుమార్ పెద్ద కుమారుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ అశోక్‌కుమార్ భార్య శిరీష కుసుమ (40) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. బ్రహ్మపురంలోని అశోక్ కుమార్ నివాసానికి మంగళవారం ఉదయం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ చేరుకుని శిరీషా మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అశోక్‌కుమార్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్‌లీడర్ భళ్ల గంగయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్సతో క్షయవ్యాధి నివారణ

కృత్తివెన్ను: క్షయవ్యాధికి సకాలంలో సరైన చికిత్స అందించడం ద్వారా నయం చేయవచ్చని క్షయ, లెప్రసీ జిల్లా వైద్యాధికారి వెంకట్రావు అన్నారు. క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం లక్ష్మీపురం పీహెచ్‌సీ వద్ద మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయవాధి లక్షణాలు, వ్యాధి సోకిన వారికి నిర్ధారణ పరీక్షలు, వైద్య సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, వైద్యులు హస్సేన్, హేమ, సిబ్బంది పాల్గొన్నారు.

విష పురుగుల సంచారంతో కాలనీ వాసుల బెంబేలు

బంటుమిల్లి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగేశ్వరరావుపేట డ్రెయిన్‌కు అనుబంధంగా ఉన్న బంటుమిల్లి బీసీ కాలనీ నీట మునిగింది. వర్షం నీరు నిల్వ ఉండటంతో కాలనీలోని ఇళ్లల్లోకి విష పురుగులు, పాములు చేరాయి. వీటి సంచారంతో కాలనీవాసులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. బంటుమిల్లి, పెందుర్రు, పెదతుమ్మిడి తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంతర్గత రోడ్లు బురదకయ్యలను తలపిస్తున్నాయి. మూడు రోజుల్లో సుమారు 20 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మురుగు నీటితో దోమలు పెరుగుతున్నాయి. ఎగువ నుండి దిగువకు మురుగునీరు చేరుతోంది. డ్రెయిన్లు తూడు, గుర్రపుడెక్కతో నిండిపోవడంతో మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక పొలాలకు ఎగదన్నుతోంది. దీంతో నాగేశ్వరరావుపేట, జయపురం, ఆముదాలపల్లి తదితర గ్రామాల్లోని పొలాల్లో వర్షం నీరు నిలిచింది. ఈ డ్రెయిన్ల పరిధిలోని రైతులు సార్వా విత్తనాలు వెద పద్ధతిన చల్లారు. పంట సుమారు 20 నుంచి 40 రోజుల దశలో ఉండటంతో కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేవీకే కార్యక్రమాలు భేష్

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని గుంటూరు లాంఫాం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జీఎంవీ ప్రసాదరావు అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లోని పలు సందర్శనా క్షేత్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. పుట్టగొడుగుల పెంపకం, కోళ్ల పెంపకం, కూరగాయల నారు పెంపకం, భూసార పరీక్ష, జీవ నియంత్రణ ప్రయోగశాలలను ఆయన సందర్శించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బందికి కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు, ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్న కేవీకేని ఆయన అభినందించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీలత, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

నలుగురి అరెస్ట్



బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు గార్లగుంట గ్రామంలో నలుగురు యువకులను అరెస్ట్ చేసి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పెడన సీఐ ఎస్. ప్రసన్నవీరయ్యగౌడ్ పర్యవేక్షణలో నిందితులు కృత్తివెన్ను మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన దాసరి మణికంఠ, పెడన పట్టణానికి చెందిన గుడిమెట్ల ప్రభు ఆనంద కుమార్, బంటుమిల్లి గ్రామానికి చెందిన గూడవల్లి ఆనంద్, నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన సోగాని వెంకట దుర్గా శివ నాగ తరుణ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిని మంగళవారం బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో మచిలీపట్నం సబ్‌జైలుకు తరలించారు.

వీడని వర్షం.. స్తంభించిన జనజీవనం

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- నీట మునిగి చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- పల్లపు ప్రాంతాలు మునక



బందరు మండలం అరిశేపల్లి గ్రామంలో నీట మునిగిన పొలాలు

గూడూరు: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పెడన, అవనిగడ్డ, మచిలీపట్నం నియోజకవర్గాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు మంగళవారం ఉదయం నుంచి విరామం లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. మంగళవారం మధ్యాహ్నానికి గూడూరు మండలంలో సుమారు 3 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో నీరు నిలిచిపోయింది. పొలాల్లో నీరు బయటకు పోక చెరువులను తలపిస్తున్నాయి. మొలక దశలో ఉన్న పంట నీటి పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు మురుగు కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అయినప్పటికీ లోతట్టు ప్రాంతాల్లో నీరు తగ్గడం లేదు. సాయంత్రం గూడూరు–పెడన రహదారిపై చెట్టు విరిగి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ అధికారులు స్పందించి వర్షంలోనే చెట్టు కొమ్మలు తొలగించి తీగలకు మరమ్మతులు చేపట్టారు. చేనేత మగ్గాలలోకి నీరు చేరడంతో కార్మికులు నేత పని నిలిచిపోయింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

పెడన: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పెడన మండలంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రోడ్లపై వర్షం నీరు నిలిచింది. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. చిరు వ్యాపారులు వ్యాపారాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. మండలంలో 7,300లకుపైగా హెక్టార్లలో వరిసాగు చేయగా వీటిల్లో 6,578 హెక్టార్ల వరకు ప్రస్తుతం ముంపులోనే ఉంది. వర్షం తగ్గుముఖం పడితే పంట చేలలో నిలిచిన నీరు బయటకు పోతుందని, అప్పుడు ముంపు బారిన పడిన పంట పొలాలు తేరుకుంటాయని వ్యవసాయ శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. 15 రోజులు దాటిన వరి మొక్క పది రోజులు వరకు నీటిలో తట్టుకుని ఉంటుందని, అంతకంటే తక్కువ రోజులు వయస్సు ఉన్న మొక్క మాత్రం బతకడం కష్టమని చెప్పారు. సోమవారం 7.9, మంగళవారం 2.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా కుండపోతగా వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. పంటలు నీటి ముంపులోనే ఉన్నాయి. ముంపు ప్రాంతాల్లో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర పర్యటించారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే నీటిని మోటార్ల సాయంతో బయటకు తోడించేలా చూడాలని కటకం ప్రసాద్ కమిషనర్‌కు సూచించారు.

ముంపులో లోతట్టు ప్రాంతాలు..

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షం కురిసింది. మూడు రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా జల్లులు పడుతుండగా, మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా మోస్తారు వర్షం కురుస్తూనే ఉంది. సాయంత్రం సమయంలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మూడు రోజుల నుంచి ముసురు పట్టడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో వర్షం ప్రభావంతో పల్లపు ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు నిలిచింది. యర్రారెడ్డివారిపాలెం, పిట్టల్లంక, లింగారెడ్డిపాలెం, మెరకగౌడపాలెం, వీవర్స్ కాలనీ, ఉల్లిపాలెం, వి.కొత్తపాలెం గ్రామాల్లో వర్షం నీరు ప్రధాన రహదారులపై నిలిచింది. ఈదురు గాలుల తీవ్రతకు వంతెన సెంటర్‌లో భారీ వృక్షం ప్రధాన పంటకాలువలో నేలవాలింది. రైతులు నారుముళ్లను ముమ్మరంగా సిద్ధం చేస్తున్న తరుణంలో ఈ వర్షానికి విత్తనాలు గుట్టలుగా పడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



బందరులో జలమయమైన ప్రధాన రహదారి

మచిలీపట్నంలో భారీ వర్షం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో మూడో రోజైన మంగళవారం కూడా భారీ వర్షం కురిసింది. వర్షం కురుస్తుండటంతో నగర ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రహదారుల్లో మోకాలిలోతు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో ప్రధాన రహదారితో పాటు పలు కాలనీల్లోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. నగరంలోని పలు ఖాళీస్థలాలు తటాకాలను తలపిస్తున్నాయి.

ప్రజల ఇక్కట్లు..

కృత్తివెన్ను: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో ఏటిపాయలు, డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. నీరు ఎగువకు ఎగదన్నడంతో పంటపొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరి అంతర్గత రహదారులపై వర్షం నీరు పారింది. నారుమళ్లు, వెదజల్లిన చేలు నీటమునిగాయి. మరో రెండు రోజుల పాటు వర్షం కురుస్తుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముంపు బారిన నారుమడులు..

కొత్తమాజేరు(చల్లపల్లి): ముసురు వర్షాలకు వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. చల్లపల్లి మండల పరిధిలోని పాతమాజేరు, కొత్తమాజేరు పరిధిలో వేసిన వరి నాట్లు, నారుమడులు, వెద పద్ధతిలో వేసిన నాట్లు నీట మునిగాయి. మాజేరు వైపు ప్రవహించే మురుగు కాలువ పూడిక తీసేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. చల్లపల్లి మండలంలోని చల్లపల్లి, మంగళాపురం, పుచ్చగడ్డ గ్రామాల్లో వేసిన వరి నారుమడులు నీట మునిగాయి.

వణికిస్తున్న వర్షం

కోనేరుసెంటర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 3,696 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తుండగా ఈ ఏడాది ప్రస్తుతం 2,000 హెక్టార్లలో వరిసాగు చేశారు. 239 హెక్టార్లలో వేరుశనగ సాగు చేసుకునే రైతులు ఈ ఏడాది 250 ఎకరాలలో సాగు చేశారు. వరికి సంబంధించి మండలంలో నారుమడుల దశలో ఉండగా.. అక్కడక్కడా నాట్లు వేశారు. మరి కొన్ని గ్రామాల్లో వెద సాగు చేస్తున్నారు. మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పంట పొలాలతో పాటు వేరుశనగ పొలాలు నీట మునిగాయి. పలు గ్రామాల్లోని రైతులు పొలాల్లోకి చేరిన నీటిని పంట బోదుల్లోకి మళ్లిస్తున్నారు. పలు గ్రామాల రైతులు జరిగిన నష్టాన్ని స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), ఆయన తనయుడు పేర్ని కిట్టు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన నాని తనయుడు కిట్టు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, తూడును తొలగిస్తున్నారు. గ్రామాల్లో నీటమునిగిన రహదారులు, కచ్చా డ్రెయిన్లలోని మురుగునీటిని తొలగించే పనులు చేపట్టారు.






కంకటావలో నీట మునిగిన పంట పొలం; పెడన మండలం కమలాపురంలో ముంపులో పంట పొలాలు; కోడూరు మండల పరిషత్ కార్యాలయం రహదారిలో నిలిచిన వర్షం నీరు; మాజేరు వద్ద ముంపులో ఉన్న నారుమడులు

యుద్ధప్రాతిపదికన వర్షం నీరు తొలగించాలి

- మంత్రి జోగి రమేష్ ఆదేశం
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ముంపు ప్రాంతాల్లో పర్యటన
- తక్షణమే గుర్రపుడెక్క తొలగించాలని సూచన

గూడూరు: మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న కుండ పోత వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ మంగళవారం గూడూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. సమాచారం అందుకున్న మంత్రి జోగి రమేష్ మండలంలోని కంకటావ, గురిజేపల్లి, ముక్కొల్లు, గూడూరు, తుమ్మలపలెం గ్రామాల్లో పర్యటించి పొలాలు ముంపు బారి నుంచి బయట పడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డ్రెయినేజీ శాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సమస్యను జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ గత మూడు రోజల వ్యవధిలో సుమారు 30 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. ఫలితంగా ఎగువ నుంచి వస్తున్న వరద నీరు కిందికి పారక గట్లు తెగి పంట పొలాలు నీట ముంపునకు గురయ్యాయన్నారు. పంట పొలాల్లో నీరు బయటకు పోయేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తనతో పాటుగా డ్రెయినేజీ శాఖ ఎస్‌ఈ ప్రసాద్‌బాబు, ఈఈ విజయలక్ష్మి, డీఈ కిరణ్‌బాబు కూడా వచ్చారని, వారంతా రైతులు ఎదుర్కొంటున్న సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించడానికి వచ్చారన్నారు. యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



పెదతుమ్మిడి డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మంత్రి జోగి రమేష్, అధికారులు

తూముల ఏర్పాటుకు ఆదేశం..

గత ఏడాది కంకటావ–కత్తుల వానిపాలెం వంతెన కూలిపోవడంతో తాత్కాలిక ప్రాతిపదికన తూములు ఏర్పాటు చేసి గ్రామానికి రాకపోకలను పునరుద్ధరించారు. తూముల కారణంగా తమ పొలాలు ముంపు బారిన పడ్డాయంటూ ముక్కొల్లు గ్రామస్తులు తూములు వేసిన ప్రాంతంలో గండి కొట్టాలని పట్టుబట్టారు. గండి కొడితే రాకపోకలు ఎలా అంటూ కత్తుల వానిపాలెం ప్రజలు వారితో వాగ్వివాదానికి దిగారు. దీంతో అక్కడకు చేరుకున్న మంత్రి జోగి రమేష్ ఇరువర్గాలను శాంతింపజేసి సామరస్యపూర్వక పరిష్కారం చూపారు. ప్రస్తుతం ఉన్న తూముల పక్కన మరో రెండు వరుసల్లో తూములను ఏర్పాటు చేయడం ద్వారా నీటి ప్రవాహం పెరిగి ఎగువ ప్రాంతంలో ముంపు తగ్గించవచ్చని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముక్కొల్లు ప్రాంతంలో మురుగుకాలువలో పెరిగిన గుర్రపుడెక్క తొలగింపు చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లజ్జబండ మురుగు కాలువలో నీరు ఎదురుతన్నుతుండటంతో తమ పంట పొలాలు ముంపుబారిన పడ్డాయని గూడూరు, తుమ్మలపాలెం రైతులు ఆవేదన వ్యక్తం చేయగా వేసవిలో మురుగు కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఆర్బీకే చైర్మన్ పర్జం మహాలక్ష్మయ్య నాయుడు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపీడీఓ డి.సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.



గురిజేపల్లిలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

త్వరలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- సెంటర్ ఏర్పాటు పనుల పరిశీలన

అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కిడ్నీ డయాలసిస్ కేంద్రం పనులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, డీసీఎస్ ఎస్. ఇందిరాదేవి, అపోలో మేనేజర్ మధు మంగళవారం పరిశీలించారు. గత ఏడాది అవనిగడ్డలో సీఎం బహిరంగ సభ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఈ ప్రాంతంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు అవనిగడ్డలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం విదితమే. అపోలో సహకారంతో పాత పీపీ యూనిట్ భవనంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ స్థల సమస్య వల్ల డయాలసిస్ సెంటర్ ఏర్పాటులో కొంత జాప్యం జరిగిందన్నారు. త్వరలోనే ఇక్కడ డయాలసిస్ సెంటర్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు సహకరిస్తున్న అపోలోకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డీసీహెచ్ ఎస్. ఇందిరాదేవి మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన డయాలసిస్ రోగులు డయాలసిస్ కోసం ప్రస్తుతం విజయవాడ, గుంటూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కేంద్రం ప్రారంభమైతే రోగుల ఇబ్బందులన్నీ తొలగిపోతాయని చెప్పారు.



డయాలసిస్ కేంద్రం పనులు పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి, డీసీహెచ్


ఆర్వో వాటర్ ప్లాంట్ షెడ్‌కు రూ.3 లక్షలు మంజూరు

స్థానిక డయాలసిస్ కేంద్రం వద్ద ఆర్వో వాటర్ ప్లాంట్ షెడ్ ఏర్పాటు చేయించాలని జిల్లా కలెక్టర్ రాజాబాబును ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఫోన్‌లో కోరారు. స్పందించిన కలెక్టర్ షెడ్ ఏర్పాటుకు రూ.3 లక్షల నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పడంతో ఎమ్మెల్యే సింహాద్రి కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైద్యులు, పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పేర్ని కిట్టు పర్యటన

శివగంగ డ్రెయిన్‌లో పూడికతీత పనులు

మచిలీపట్నం టౌన్: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ముంపు బారిన పడిన లోతట్టు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మంగళవారం పర్యటించారు. నగరంలోని 50వ డివిజన్ శివారు ప్రాంతాల్లో నీట మునిగిన కాలనీల్లో ఆయన పర్యటించి ముంపునీటి తొలగింపు చర్యలపై నగర పాలక సంస్థ అధికారులతో చర్చించారు. కాలనీల్లోని ముంపు నీటిని తరలించేందుకు కాలనీల పక్కనే ఉన్న శివగంగ మేజర్ డ్రెయిన్‌లో గుర్రపు డెక్క తొలగింపు పనులను అధికారులు జేసీబీతో చేపట్టారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ శివగంగ డ్రెయిన్‌లో గుర్రపుడెక్కను తొలగిస్తే కాలనీల్లోని మురుగునీరు నిల్వ ఉండదని చెప్పారు. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు చేరకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 50వ డివిజన్ ఇన్‌చార్జి మరీదు నాగరాజు, నాయకులు కేశన నాని, గంగుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



బందరు 50వ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతంలో పర్యటిస్తున్న పేర్ని కిట్టు

సురక్షతో ఇంటివద్దకే సర్టిఫికెట్లు

కోడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పలు రకాల సర్టిఫికెట్లు లబ్ధిదారుల ఇంటివద్దకే వస్తున్నాయని, ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌ఓ, మండల ప్రత్యేకాధికారి రాజశేఖర్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ అర్హత ఉండి గతంలో సర్టిఫికెట్లు పొందని వారికి సురక్ష కార్యక్రమం ద్వారా మేలు జరుగుతుందన్నారు. 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. వలంటీర్లు క్షేత్రస్థాయిలో పని చేసి అర్హులందరికీ సర్టిఫికెట్లు అందేందుకు కృషి చేయాలని డీఎల్‌ఓ ఆదేశించారు. అనంతరం సచివాలయ పరిధిలోని 513 మందికి సర్టిఫికెట్లను అందించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, సర్పంచి వెన్నా షైనీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తర చిరువోలులంకలో సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, తహసీల్దార్ నవీన్‌కుమార్

ఉత్తర చిరువోలులంకలో..

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ముంగిటకే తెచ్చి సర్టిఫికెట్లు అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ దీవించాలని సర్పంచ్ చింతా శ్రీనివాసరావు కోరారు. మండల పరిధిలోని ఉత్తర చిరువోలులంక సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 330 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్రౌతు వెంకట రమణ, తహసీల్దార్ కె. నవీన్ కుమార్, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ రాము, కంబాల సుబ్బారావు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

605 సర్టిఫికెట్ల పంపిణీ..

నడకుదురు(చల్లపల్లి): జగనన్న సురక్ష గ్రామీణ పేదలకు అత్యంత ప్రయోజనం కలిగించే కార్యక్రమం అని ఎంపీడీఓ సీహెచ్ చిన రాట్నాలు అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు 605 సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొరిపర్తి సురేష్, ఎంపీటీసీ డొక్కు దేవేంద్రరావు, ఈఓపీఆర్డీ బూరేపల్లి అశోక్, సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, వీఆర్వో గొల్లపూడి రాజేంద్ర పాల్గొన్నారు.

పెదతుమ్మిడి, మల్లపరాజుగూడెంలో..

బంటుమిల్లి: మండల పరిధి పెదతుమ్మిడి, మల్లపరాజుగూడెం గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పెదతుమ్మిడిలో 359, మల్లపరాజుగూడెంలో 312 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు అందజేశారు. ఎంపీపీ వి. చినబాబు, తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, జె. స్వర్ణభారతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

పెడన: స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమం ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పెడన ఎంఈఓ–2 వైవీ హరనాథ్ అన్నారు. చెన్నూరులో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. చెన్నూరుతో పాటు పెడన బీజీకే జెడ్పీహెచ్‌ఎస్, బల్లిపర్రు ఎంపీయూపీఎస్, 5వ వార్డులోని ఉర్దూ బాలికల పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు జరుగుతున్నాయన్నారు. బోధనలో మెలకువలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారని చెప్పారు. తద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించవచ్చని వివరించారు. పెడన బీజీకే పాఠశాలలో పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శిక్షణ పొందారన్నారు.

లెప్రసీపై సర్వే

లక్ష్మీపురం(చల్లపల్లి): సరైన అవగాహనతో లెప్రసీ నిర్మూలన సాధ్యమని రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కుంభా రత్నగిరి అన్నారు. లెప్రసీ వ్యాధిపై ఎల్‌సీడీసీ సర్వే మంగళవారం లక్ష్మీపురం ఎస్టీ కాలనీలో నిర్వహించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలను వివరించి, వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. వైద్యాధికారులు పాల్గొన్నారు.